# భిన్నత్వంలో ఏకత్వం

భోజనాలైనాక ఆడవాళ్ళంతా వంట గదిలోంచి చావిట్లోకి మార్చారు మకాం. అన్నపూర్ణమ్మ పైటచెంగు పర్చుకుని, కుడిచెయ్యి తల కింద పెట్టుకుని కునుకు తియ్యటానికి అటూ ఇటూ దొర్లుతూ ప్రయత్నిస్తోంది.

"అమ్మా! మా పాప కేమేమి చేయించాలో తెలుసా! చేతులకు గాజులూ, మొల్లోకి బిళ్లా, మామిడి పిందెలూ, ఓ గొలుసూ — మొత్తం ఐదు కాసులైనా పెట్టాలి" — అంది పెద్దకూతురు గంగ — పాపని ముద్దెట్టుకొంటూ తల్లి నుద్దేశించి.

మూడో కూతురు సరస్వతి మొహం చిట్లించింది. "ఇంకేమైనా మార్చిపోయావేమో చూడు!" — అంది వెటకారంగా.

గంగ క్షణం ఆలోచించి — "ఏం మర్చిపోయానంటావ్? ఆ మరే నేవ్! జ్ఞాపకం వచ్చింది. ఉంగరాలు కావొద్దూ? ఈ చిట్టి వేళ్ళకి రెండుంగరాలు కూడానేవ్ అమ్మా!" — అంది పాప వేళ్ళని గట్టిగా ముద్దెట్టుకుంటూ.

"చాలా? ఒడ్డాణం అదీ అక్కర్లేదూ?" — వెటకారంగా నవ్వుతూ అంది రెండో కూతురు యమున.

గంగ చెల్లెళ్ళకేసి ఓ క్షణం తీక్షణంగా చూసి — "ఓ పెడితే అన్నీ కావాలి. మధ్యలో మీ కెందుకు? అడిగేదాన్ని నేను పెట్టేది అమ్మా వుండగా? ఇవ్వాళ నన్ను వెటకారం చేస్తున్నారు గాని రేపు మీ పిల్లలకి ఇంతకంటే ఎక్కువే కావాలని కూర్చుంటారు." అంది మూతి తిప్పుకుంటూ.

"అడగటానికి మాత్రం హద్దూపద్దూ వుండాలా? ఉన్నదీ లేనిదీ కడుక్కు తీసుకుపోతే ఇక వెనకాల వాళ్ళేమై పోతారేం? నువ్వొక్కర్తివేనా? నా కిప్పటికి గొలుసూ లేదు. ఏమీలేదు" — అనుకొంటూ మెడ తడుముకొంది యమున.

"ఆ తాహతుంటేనే పెడుతుంది. ఎవరికెంత — పెట్టాలో దానికి మాత్రం తెలీదా? మీ సొమ్మేదో ధారపోస్తున్నట్టు బాధపడి పోతారేం?"

"గడిచి గట్టెక్కితే అలాగే వుంటుంది. పెద్దది పెద్దదని మా కంటే ఎక్కువగానే ముట్ట చెప్పారు నీకు. ఏమైనా పెద్దవాళ్ళకి జరిగినట్టు ఆఖరి వాళ్ళకు జరగనే జరగదు. రాగా రాగా మోజు తగ్గుతుందిలే పెట్టే వాళ్ళ కైనా" - అంటూ మడతకుర్చీలో వెనక్కి వాలింది సరస్వతి.

"ఎందుకలా పట్టింపులు పడతారు? ఎవరెక్కువ తింటే యేం పోతుంది? పెట్టుపోతల విషయాలు మీ అమ్మకే తెలుస్తాయి. మధ్యలో మీకెందుకు అనవసరంగా!" - అంది పుస్తకం తిరగేస్తూ మూడో కోడలు వాసంతి.

ఆడబిడ్డలు ముగ్గురూ ఓసారి ఆవిడకేసి ఉరిమి చూశారు. "ఎంత ప్రేమ వొలక బోస్తున్నావమ్మా! సంసారమంతా కడిగి ఆడబిడ్డల కెట్టారని తర్వాత అత్తగార్ని పట్టుకు సాధించొచ్చనా? చేతులు తిప్పుకొంది — రెండో ఆడబిడ్డ యమున.

"మే మెందుకు సాధిస్తాం? మాదేం పోతుంది? ఎవరు కన్నవాళ్ళకి వాళ్ళు పెట్టుకోక మానార్తా?" పుస్తకం మీద దృష్టి కేంద్రీకరించి అంది వాసంతి.

"కబుర్లు చెప్పటానికేమిలే, వాళ్ళేదో పైపైకి వాగుతున్నారుగాని, నిజంగా మాకు కావలసిందల్లా తీసికెళ్ళే మూతులు తిప్పుకొనేది మీరే. అసలీ కాలంలో ఆడబిడ్డలకికూడా పెట్టనిస్తారా తల్లీ!" — అంటూ చెల్లెళ్ళని వెనకేసుకొచ్చింది గంగ మరదలి మీదికి దండెత్తుతూ.

వాసంతి తెల్లబోతూ తలెత్తి చూచి మళ్ళా పుస్తకం చూస్తూ — "ఏదో శాస్త్రం చెప్పినట్లు వాళ్ళలో వాళ్ళు ఎక్కువ తిని పోతున్నారని కీచులాడుకొంటూ మధ్యనుంచి చెప్పబోతే నా మీద పడ్తారేం? ఐనా పెద్దక్కలిద్దరూ వుంటే వీళ్ళంత సులువుగా మీది కొచ్చేవాళ్ళు కారు. ఒక్కదాన్ని చేసి ...." అనుకొంది.

ఇంతలో వీధిలో బట్టలవాడి కేక విన్పడింది. ఆ కేక వింటూనే మడత కుర్చీలోని సరస్వతి త్రుళ్ళిపడి లేచి, వీధిలోకి పరుగెత్తి — "ఓ

అబ్బాయ్ ఇలా రా యిలా" అని పిలిచింది.

"ఎందుకే యిప్పుడు వాడు? అమ్మ దగ్గర డబ్బులేదుగా?"— అంది యమున.

"పట్టుమని పది చీరలైనా లేవు గాని ఎందు కంటా వేం? నాదాకా వస్తే ఎవరి దగ్గరా డబ్బుండదు. ఐనా నీ కెందుకు? అమ్మ కొంటుంది"— అంటూ యింట్లోకి పరుగెత్తి చాపతెచ్చి వాల్చింది సరస్వతి.

బట్టలతను చాపమీద మూట విప్పటం మొదలెట్టాడు. సరస్వతి వాళ్ళమ్మని — "లేవే అమ్మా! బట్టలబ్బాయి వచ్చాడు. నాకు చీరలు కొంటాన్నావుగా! కొనవా?" .... అంటూ లేపుతోంది.

అన్నపూర్ణమ్మ కళ్ళయినా తెరవకుండా — "నచ్చితే ఒకటి తీసుకో" - అంది వత్తిగిలుతూ.

సరస్వతి చీరలన్నీ సెలక్టు చెయ్యటం మొదలెట్టింది.

యమున వాళ్ళమ్మని విసురుగా లేపుతూ — "ఏమ్మా? నాక్కూడా ఒకటి కొనవా? ఏమే నాకు మాత్రం ఎన్ని వున్నాయేమిటి?" — అంటూ ఏడుపు మొహం పెట్టింది.

అన్నపూర్ణమ్మ విసురుగా లేస్తూ — "అబ్బబ్బా ఏం గొడవే చెవుల్లో జోరీగల్లాగా చేరారు." — అంటూ మళ్లాపడుకుని నిద్రనటించ సాగింది.

యమున మొహం రోషంతో కందగడ్డ అయింది. సరస్వతి రెండు చీరలు వదినగారికిస్తూ, "చూడొదినా ఏదిబావుంటుందో" — అంది.

వాసంతి వాటిని పరీక్షచేసి "ఈ నలుపుపూతల్ది నీ కేమంత బావుం డదు. ఎర్రగా వుంటుంది కాబట్టి యమునకు బావుంటుంది. నువ్విది తీసుకో?" — అంది రెండో దాన్నిస్తూ.

"బావుందిలే నీ వరస. డబ్బు లేదో డబ్బు లేదో అని వాళ్ళఘో రిస్తుంటే నాకొకటి పురమాయిస్తావెందుకూ? ఆడబిడ్డకి తలో చీరకీ సారె తెచ్చావా ధనం?" – మూతి ముడుచుకుంది యమున కోపమంతా వాసంతి మీద — చూపిస్తూ.

"ఏదో మా తాహతుకొలదీ తెచ్చాం. ఎదటివాళ్ళు తెచ్చేదేపాటి?"

అంటూ లేచి వెళ్ళిపోయింది వాసంతి.

తల్లి బొడ్లో తాళం గుత్తి తీసి డబ్బు తెచ్చి. చీర లోపల పెట్టు కొచ్చి తాపీగా కుర్చీలో జార్లా బడింది సరస్వతి.

* * *

"నేనూ సావిత్రీ వంటపని చూస్తాంగాని. నువ్వు గదులు తుడువు. వాసంతికి వంట్లో బావుండలేదేమో లేవలేదు" — అంటూ అన్నపూర్ణమ్మ పెద్దకోడలు జానకికి పురమాయించింది.

"ఏం బావుండ లేదావిడ గారికి? తినేటప్పుడు లేని తెగుళ్ళన్నీ పని చేసేప్పుడు పిలవకుండానే వస్తాయి. నే నొకదాన్నున్నాగా వెట్టిపనికి" — చీపురుకట్ట బాగుచేస్తూ సణుక్కుంది జానకి.

"ఏదోకాస్త సుస్తీగా వుంటే మట్టుకు ఓపిక చేసుకు లేవకూడదూ? పది మందిగలింట్లో ఎక్కడి వాళ్ళక్కడ పడుకుంటే పన్లెలా అవుతాయి?" వంటగదిలోంచి గొణిగింది సావిత్రి.

"పోనీ ఏదో బద్ధకంగావుంది కావాలి. ఒక్కపూటకి ...." సమర్థించ బోయింది అత్తగారు.

"మీరూ, మీ కూతుళ్ళూ - వున్నప్పుడు ఎవరమైనాబద్ధకిస్తే ఇలా సరిపెట్టుకుంటారా? మీ అమ్మాయిలెక్కడ అరిగిపోతారోనని అప్పుడు మాత్రం చచ్చినట్లు చెయ్యాలి. అంతా ఇంతకీ కడసారిపావిడంటే మోజు గానే వుంటుంది - పెద్దకోడలు జాడించుకుంది.

వాసంతి విసురుగా లేచివచ్చి - "ఏమిటమ్మోయ్! మహా సణుక్కు పోతున్నారు. కాస్త బద్దకించి లేవకపోతే ఓనాటికే ఇదై పోతున్నారు. నెల్లాళ్ళు పుట్టిళ్ళదగ్గర కూర్చుంటే యింటెడు చాకిరీ నే చెయ్యలా?" అంది చేతులూపుకొంటూ.

సావిత్రి బియ్యంచేట పట్టుకుని బయటకొచ్చి "ఇక నువ్వెప్పుడూ ఎక్కడికీ వెళ్ళనట్టే చెప్తున్నావే? ఇంట్లో వుంటూ తింటూ కూర్చుంటే ఎవరుచేసి పెడతారు? మేం వెళ్ళినప్పుడు తిండీ తప్పింది. చాకిరి

తప్పింది"- అనేసి మళ్ళా వంటగదిలో దూరిపోయింది. వాసంతి కొరకొర లాడుతూ- "నాకేం పిల్లేడవాలా ? జల్లేడవాలా ? ఒక పూటకి కూర్చుంటే మాత్రం ఏం చెయ్యగలరు మీరంతా ? నా కీ పూట తిండే వద్దు. కాక పోతే ఆనక నేనే వండుకు తింటాను-" అంది మొండిగా.

జానకి గది తుడిచేదల్లా చీపురాడింఘుకొంటూ ఇవతలికొచ్చి- "ఇంతకీ నువ్వనేది నన్ను గురించేగా ! నాకు పిల్లలున్నారనేగా నువ్వేడ్చి పోయేది. నా పిల్లలకి నువ్వేమంత చాకిరీ చేస్తున్నావే తల్లీ -" అంటూ ఓ సారి అటూ ఇటూ తిరిగి లోపలికి కెళ్ళింది విసురుగా.

సరస్వతి మొహం కడుక్కొ-దాని చేతిలో పళ్ళపొడి పోసుకొని ఇవతలి కొచ్చింది. పక్క-మీద వుండగానే వదినగార్ల విసుర్లు విని లేచి వచ్చింది. "నన్ను లేపకపోయావా చిన్నొదినా ? పోనీ నేను చేసిపెడు దునుగా ! రోజూ మీరే చేసుకొంటున్నారని నేను లేవలేదు-" అంది వాసంతిని చూస్తూ.

"మీ కెందుకులేమ్మా మా శ్రమ. మీరు ఆడబిడ్డలూ మేము కోడళ్ళ మాయె, మీకు పనెలా పురమాయించటం ? తోచినకాడికి చేద్దామని మీకే వుండాలిగాని-" వ్యంగ్యంగా అంది వాసంతి.

"నీకు పిచ్చేమిటే వాసంతీ ? ఆవిడెందుకు చేస్తుందీ ? లేచో, లేవకో మనకు తప్పదుగాని. తిరా ఏ పనైనా చెప్పినా కోడళ్ళుండికూడా ఆడబిడ్డల్తో పనుల్చేయించుకొంటున్నారని మనం మాటలు పట్టానికా ?-" అంది జానకి తోటికోడల్ని మందలిస్తున్నట్లుగా - పోగుచేట పట్టుకొస్తూ.

ఈ గొడవంతా వినీ వినీ అన్నపూర్ణమ్మకి విసుగెత్తింది.

"దానిమీద పడ్తారెందుకూ ? ఐనా దానికింకా ఈ ఇంట్లో చెయ్య వల్సిన పనేముంది ? పెద్దాళ్ళిద్దరూ వెళ్లారా ? ఇక ఇదీ వెళ్తుంది నాలుగు రోజుల్లో, మీ ఇంటిపని మీరు చేసుకోటానికి కుమ్ములాడ్తారేం ? పెద్దదాన్ని

ఏదో వున్నానని నా గౌరవమేమైనా ఏడిచిందీ ? తెల్లారిలేచి యుద్ధం పెట్టుకు. కూర్చోకపోతే ఎవరిపని వాళ్ళు చేసుకుపోతే అసలీ గొడవెందుకొస్తుందీ ? ఐనా, తప్పుపని చేశారుగాని తలొక లక్షాధికారినీ పెళ్లాడితే శుభ్రంగా, పీస మెత్తు పనిలేకుండా కాలు మీద కాలేసుకొని కూర్చుందురుగా ? ఈ గుమస్తా గాళ్ళని చేసుకొంటే పనిచేసుకోవల్సి వుంటుందని తెలీదూ ? లేకపోతే తలొక దాసీదాన్ని పంపమనండి పుట్టిళ్ళనుంచీ."

"లక్షాధికారుల్ని చేసుకొనే తాహతే వుంటే మీ రీ మాటెందు కంటారూ ?"

"తీరా మేము దాసీల్ని ఖాసాల్ని తెచ్చుకున్నా మీ అబ్బాయిలు పెళాల్ని పోషిస్తారా ? వాళ్ళనే భరిస్తారా ?"

"మీరైనా కోటీశ్వరుల పిల్లల్ని చేసుకొంటే మాలాంటి జగడాల వాళ్ళతో గొడవలేకుండా వుండేది మీకు."

ఈ విధంగా కోడళ్లు ఏకమై విసుర్లు విసిరేసరికి అత్తగారు తెల్ల బోయి నోరు తెరిచింది. "వాళ్లు కుమ్ములాడుకొంటే నుట్టుకు మనని అన నిస్తారేమిటి ? నీ కెందుకు ? వూరుకో–" అంది సరస్వతి తల్లితో.

*　　　*　　　*

"మీరెన్ని గింజుకున్నా సరే, ఇవ్వాళ నేను సైకిలు తీసుకెళ్లటం తథ్యం–" అని ఖచ్చితంగా చెప్పేసి, తిరిగి సైకిల్ నునుపు చెయ్య సాగాడు రెండో కొడుకు జనార్దనం.

"నీకు న్యాయం కాదురా చిన్నన్నయ్యా ! పొద్దుట్నుంచీ ఎన్నిసార్లు బజారు కెళ్ళానో తెలుసా ? సైకిలేమో నాన్నెక్కడికో వేసుకెళ్ళి ఇప్పుడు తెచ్చాడు. నా కాళ్ళన్నీ నొప్పులెడుతున్నాయి. ఇంక రెండు మైళ్ళునడిచి వెళ్ళలేనురా. పోనీ ఈ పూటకి మానేద్దామా అంటే సైన్సుందిరా–"

అన్నాడు బ్రతిమలాడుకొంటూన్న ధోరణిలో చిన్నవాడు హరి.

ఇదేమీ విన్పించుకోకుండా రెండోవాడు సైకిల్‌కి మెరుగులు దిద్దుకొంటున్నాడు. పెద్దవాడు శంకరం స్నానంచేసి వళ్ళు తుడుచుకొంటూ వచ్చి –" "ఏంరోయ్! జనార్ధనం బాగా క్లీనుచేసి పెట్టావురాబాబూ. నాకూ పని తప్పింది–" అంటూ ఒంగుని సైకిల్‌ని పరీక్ష చెయ్యసాగాడు.

"నీకోసం గాదన్నయ్యా తుడవటం. నే నేసుకెళ్ళాలి–" అన్నాడు తెల్లబోతూ రెండోవాడు. పెద్దాడు ముఖం గంభీరంగా పెట్టి–

"అదేం కుదరదు. నాకసలే లేటైపోయింది. మా యమధర్మరాజు భయంకరుడు. భోంచేసి వస్తా –" అంటూ వెళ్ళబోతున్నవాణ్ని ఆపి "మీ కుమ్మలాటేనా? నామాటేమైనా వింటారా? ఒక్కపూట కాలేజీ మానేస్తే ఎంత నష్టమో చూడు. ఈ కాళ్ళనొప్పుల్తో ఎలా వెళ్ళేది? ఉష్ ఏమైనా సరే ఇవ్వాళ సైకిల్ నాదే" అంటూ చతికిలబడి కాళ్ళు నొక్కుకోసాగాడు హరి.

"పడుచువాళ్ళకి మీకు సైకిలెందుకురా? మీ నాన్నగారెళ్తారు వుంచెయ్యండి–" అంది అన్నపూర్ణమ్మ చావట్లోకి వస్తూ.

"బాబోయ్. కాళ్ళు నొప్పులమ్మోయ్ ఉస్."

మడతకుర్చీలో పడుకొని పుస్తకం చదువుకొంటున్న సరస్వతి పక్కుమని నవ్వింది. పుస్తకం మడిచి చేతిలో పట్టుకొని – "నీ ఎత్తులు తెలుసుగాని అలా వాడేస్తుంటే కొత్త చెడిపోదూ?" అంది.

"కొత్త చెడిపోవడమేమిటి ?" ఆశ్చర్యంగా అడిగాడు శంకరం.

"వాళ్ళాయన సైకిల్ కావాలంటున్నాడట. కొని నెల్లాళ్ళేగా బొత ? ఇది నచ్చితే ఇద్దామన్నారు. మీ నాన్న?" అంది అన్నపూర్ణమ్మ. ఇది విని హరి చతికిలబడ్డవాడల్లా లేచి లోపలికి పరుగెత్తి సైకిల్‌తాళం పుచ్చుకొని

గబగబా బయటకొచ్చాడు. అది సైకిల్ తుడుస్తున్న జనార్దనం చేతిలో పెడుతూ — "ముందు తాళం వేసెయ్‌రా. త్వరగా ఎలా వెళ్తుందో చూద్దాం —" అన్నాడు. జనార్దనం తాళంవేసేసి తాళంచెవి శంకరాని కిచ్చాడు. శంకరం దాన్ని చెల్లెలికి చూపిస్తూ. ఏడిపిస్తున్నట్టుగా జేబులో వేసుకొన్నాడు. "బావుందిలే వరస. ఇదిగాకపోతే దీని తాతలాంటి దింకోటి వస్తుంది. అసలు మోటార్‌సైకి లడగవలసింది —" అంది వ్యక్రోషంతో సరస్వతి. హరి చెల్లెలి దగ్గరగా వచ్చి వంగుని "మీ వారు సైకిల్ చాల న్నారా? లేక...." అనబోతుంటే — "పోదూ నాన్న ఇమ్మంటే సరి —" అని కసిరికొట్టింది.

"ఎలాగూ నీ మొగుడికి మొన్ననేగదా వాచీ యిచ్చింది. మళ్ళా సైకిలా? -" అన్నాడు రెండో అన్నయ్య.

పెద్దన్నయ్యకూడా వూరుకో లేదు. "కాస్త మమ్మల్ని కనిపెట్టి చూడవే అమ్మా, ఉన్నదీ లేనిది వూడ్చుకుపోతే, గుమస్తాగాళ్ళం. మాగతేం కానే తల్లీ?" — అన్నాడు వేళాకోళం చేస్తూ.

హరి మళ్లా అందుకొని "నాన్నా, పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా నేనూ, పెద్దన్నయ్య కొడుకూ నాలుగున్నర జమా జెట్టీలలాంటి మగాళ్లం వుండగా, మా కక్కర్లేదనా మీ వారి కిచ్చుకోవటం? నీకు న్యాయమేనా అడగటం?" అన్నాడు విసురుగా పచార్లుచేస్తూ.

"మీరు మీ అత్తారినడిగి తెచ్చుకోండి —" అంది సరస్వతి పుస్తకం అడ్డుపెట్టుకుని, కుర్చీలో జార్లాబడి.

"అబ్బీ! ఎంతమాటన్నావ్ నీ మొగుడిలా వాళ్ళనీ వీళ్లనీ దేవురించు కోమేవ్ సరసూ."

"వెధవ సైకిల్ లేకపోతే నిక్షేపంలా నడిచి వెళ్ళిపోతాంగాని."

"మరే ఒకళ్ళిచ్చిందేపాటి?"

అన్నలు చేసే వేళాకోళానికి సరసు మొహం కోపంతో ఎరుపెక్కింది. "రావలసినచోట పట్టుకెళ్లటం అడుక్కోవట మెలా ఔతుంది? పెద్ద బడాయిలు కొట్టకపోతే. మీ వాళ్లకి పెట్టే తాహతు లేదనరాదూ?" అంటూ విసురుగా లేచి వెళ్ళిపోయింది.

శంకరం ఫక్కుమని నవ్వాడు.

అన్నపూర్ణమ్మకూడా ముసిముసిగా నవ్వుతూ— వాళ్ళేదో నిన్ను వుడికిస్తుంటే నీకా కోపం దేనికే —" అంది.

"ఉడికించటం కాదే, నిజంగానే అంటున్నాం. కోపం వస్తేవచ్చిందిలే. మమ్మల్ని ఏమన్నా సరే సైకిల్ మాత్రం వదిలేస్తే చాలు" అన్నాడు గట్టిగా హరి సరస్వతికి వినపడేలా.

శంకరం జేబులోంచి సైకిల్ తాళం తీసి జనార్దనానికిస్తూ— "నీకు సరాగా వుంది కాబోలు వెళ్లరా. ఫర్వాలేదు. నే నడిచే వెళ్తానులే"—అని భోజనం చెయ్యటానికి వెళ్ళిపోయాడు.

జనార్దనం తాళం చెవి హరికిస్తూ, "నీకు కాళ్లు నొప్పులంటున్నావుగా. పోనీలే నువ్వే వెళ్ళు—" అన్నాడు.

కాళ్ళ నొప్పులు మర్చిపోయి, ఇంతసేపూ చకాచకా పచార్లు చేసినందుకు నాలుక కొరుక్కుంటూ తాళం జేబులో వేసుకొని, సైకిల్ సీటు మళ్లా ఓ సారి దులుపుకొని, లోపలికెళ్ళాడు భోజనానికి హరి "అమ్మోయ్ నొప్పులు బాబోయ్-" అంటూ.

ఆడబిడ్డలు తమలో తాము పోట్లాడుకొంటూ, సందు దొరికితే కోడళ్ల మీద విసుచుకుపడడం సహజం. తోటికోడళ్ళు కీచులాడుకొంటున్నా అవకాశం దొరికితే, అత్తా ఆడబిడ్డలమీద కసి తీర్చుకోటం పరిపాటే. కొడుకులుకూడా సాధ్యమైనంతవరకూ తమ ఆస్తిని బావమరుదులు తీసుకుపోకుండా చూస్తారు. ఈ విధంగా ప్రతి సంసారంలోనూ భిన్నత్వంలో ఏకత్వం వుంటూనే వుంటుంది.

"(ఆంధ్ర" వారపత్రికనుంచి)